# పర్యాటక కేంద్రంగా.. రంగధాముని చెరువు

- లేక్ ఫ్రంట్‌పార్కును ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- రేపటి ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


రంగధాముని చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 3 : కూకట్‌పల్లి రంగధాముని (ఐడీఎల్) చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. రేపు (గురువారం) రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖమంత్రి కల్వకుంట్ల తారాకరామారావు చేతుల మీదుగా రంగధాముని చెరువుగట్టుపై రూ.9 కోట్లతో చేపట్టిన రంగధాముని లేక్ ఫ్రంట్ పార్కును ప్రారంభించనున్నారు. అలాగే రూ.14 కోట్లతో చేపట్టనున్న రంగధాముని చెరువు సుందరీకరణ, సీవరేజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ కల్వారి టెంపుల్ రోడ్డులో రూ.12.5 కోట్లతో చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. కాగా.. మంగళవారం రంగధాముని చెరువుగట్టుపై పార్కు పనులను ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి రంగధాముని (ఐడీఎల్) చెరువును ట్యాంక్‌బండ్ తరహాలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.9 కోట్లతో లేక్‌ఫ్రంట్ పార్కును తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ



మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న రంగధాముని లేక్‌ఫ్రంట్ పార్కు

పార్కులో మహిళలు, చిన్నారులు, యువకులు, వృద్ధులు కాలక్షేపం చేసేలా సకల వసతులు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. కూర్చునేందుకు బెంచీలు, విభిన్నమైన ఫ్లవర్ లైటింగ్, గజిబో, ప్లాంటర్ బాక్సులు, పచ్చని మొక్కలతో గ్రీనరీ, చెరువు చుట్టూరా కంచె ఏర్పాటు, పబ్లిక్ టాయిలెట్లను నిర్మించినట్లు తెలిపారు. అలాగే చెరువులోకి మురుగునీరు రాకుండా కొత్తగా సీవరేజ్ పైప్‌లైన్ పనులను చేపట్టడం జరుగుతుందని.. తద్వార చెరువు స్వచ్ఛమైన నీటితో కళకళలాడుతుందన్నారు. చెరువు చుట్టూరా వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో చెరువులో బోటింగ్ చేస్తూ ఆహ్లాదంగా గడిపేలా అన్ని రకాల వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.

**మురుగునీటి సమస్యలకు పరిష్కారం..**

మురుగునీటి ప్రవాహ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని.. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని ఎస్ఎంఆర్ అపార్టుమెంట్ (కల్వారి టెంపుల్) రోడ్డు నుంచి ముళ్లకత్వ చెరువు వరకు పలు ప్రాంతాలలో అధిక సామర్థ్యం కలిగిన సీవరేజ్ పైప్‌లైన్ పనులను చేయనున్నట్లు తెలిపారు. ఎస్ఎంఆర్ వినయ్ నుంచి గోపాల్‌నగర్ మీదుగా ముళ్లకత్వ చెరువు వరకు పలు ప్రాంతాల్లో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వరదనీటి ముంపు సమస్యలను పరిష్కరించడం, మురుగు నీరు సజావుగా దిగువ ప్రాంతాలకు వెళ్లేలా పనులు చేస్తున్నామని ఈ పనులు పూర్తయితే సమస్యలు దాదాపుగా తీరుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఈఈ పద్మ, ఏఈ సంధ్య, ఏసీపీ శివభాస్కర్, సీఐ సురేందర్ గౌడ్, ట్రాఫిక్ సీఐలు నాగేశ్, నర్సింహారావు, జీహెచ్ఎంసీ అధికారులు, కో ఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, ముద్దం నర్సింహ యాదవ్, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబూరావు, తూము శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

**● రేపు ప్రగతి నివేదన సభ..**

కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధిపై ఈనెల 5న (రేపు) కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో నిర్వహించనున్న ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కృష్ణారావు కోరారు. ఈ మేరకు మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో ప్రగతి నివేదన సభ ఏర్పాటు పనులను ఎమ్మెల్యే ఆయా విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు జరిగే ప్రగతి నివేదన సభకు ముఖ్య అతిథులుగా మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారని.. నియోజకవర్గం పరిధిలోని ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

### నేడు బాలాజీనగర్‌లో..
## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 3 : కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కృష్ణారావు శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ శిరీషా బాబూరావు తెలిపారు. నేడు ఉదయం 8 గంటలకు వివేక్ నగర్ రోడ్డు నెం.1, కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెం.5, కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాప్, కాలనీ 3వ ఫేజ్ కన్యకాపరమేశ్వరీ టెంపుల్ రోడ్డు, భువనవిజయం గ్రౌండ్ కమ్యూనిటీ హాల్ పక్కన, ఆంజనేయనగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన, శ్రీహరినగర్ వసుంధర వైద్యశాల వద్ద, ప్రగతినగర్ రోడ్డు నెం.10, టి. అంజయ్యనగర్ సాయిబాబా గుడి పక్కన సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే కృష్ణారావు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### రేపు కేపీహెచ్‌బీ కాలనీలో..
### ఓపెన్ జిమ్‌ల ప్రారంభం..
## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 3 : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లో అభివృద్ధి చేసిన ఓపెన్ జిమ్‌లను ప్రారంభించడంతో పాటు సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే కృష్ణారావు శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీ 3, 4వ ఫేజ్‌లు, కాలనీ 6వ ఫేజ్ మహాత్మాగాంధీ పార్కులో, శిల్ప వాటర్ ట్యాంక్ పార్కులో, కాలనీ 9వ ఫేజ్ హెచ్ఐజీ పార్కులో, కాలనీ విజయరామారావు పార్కు, డ్రీమ్‌వ్యూ కాలనీ పార్కులలో అభివృద్ధి చేసిన ఓపెన్ జిమ్‌లను ప్రారంభించనున్నారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లో రేషన్ షాప్ వద్ద, కాలనీ 3వ ఫేజ్ రమ్యాగ్రౌండ్ వద్ద సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, బీఆర్ఎస్ పార్టీల నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోపారు.

# సమస్యలులేని ప్రాంతంగా తీర్చిదిద్దుతా

అల్లాపూర్,అక్టోబర్3: అల్లాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి సమస్యలు రహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీవివేకానందనగర్‌లో రూ.11లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ పైపులైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాత పైపులైన్ సామర్థ్యం తగ్గిపోవడంతో, వాటి స్థానంలో కొత్త పైపులైన్ పనులు ప్రారంభిస్తున్నామని కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రోణంకి జగన్నాథం, దేవరింటి మస్తాన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి తదిదరులు పాల్గొన్నారు.


అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

### లూలూ మాల్ వెళ్లేవారు..
# ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 3 : కేపీహెచ్‌బీ కాలనీలోని లూలూ మాల్‌కు వచ్చే వినియోగదారులు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలని కేపీహెచ్‌బీ కాలనీ ట్రాఫిక్ సీఐ వి.నర్సింహారావు విజ్ఞప్తి చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ హైటెక్‌సిటీ రోడ్డులో ఇటీవల ఏర్పాటు చేసిన లూలూ మాల్‌లో కేవలం 800 కార్లు, 800 బైక్‌లకు మాత్రమే పార్కింగ్ సౌకర్యం ఉందని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ మాల్‌లో వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేసేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు సొంత వాహనాలతో లూలూ మాల్‌కు చేరుతున్నారని ఈ మాల్‌లో సరిపడా పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల వాహనాలను రోడ్లపై, సమీపంలోని గల్లీలో పార్కింగ్ చేస్తున్నారని తెలిపారు. గత రెండ్రోజులుగా 10 నుంచి 15వేల వాహనాలు వస్తున్నట్లు తేలిందన్నారు. ఒక్కసారిగా వాహనాలు కేపీహెచ్‌బీ కాలనీలోని లూలూ మాల్‌కు రావడంతో కేపీహెచ్‌బీ కాలనీ హైటెక్‌సిటీ.. జేఎన్‌టీయూహెచ్ చౌరస్తా నుంచి కూకట్‌పల్లి వైపు.. జేఎన్‌టీయూహెచ్ చౌరస్తా నుంచి మియాపూర్ చౌరస్తా రోడ్డులో, ప్రగతినగర్ మార్గాలలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. ఈ ట్రాఫిక్ రద్దీ వద్ద ఐటీ ఉద్యోగులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వైద్యశాలలకు వెళ్లే అంబులెన్స్‌లు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాగా.. కేపీహెచ్‌బీ కాలనీలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలలో వాహనాలను మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకు లూలూ మాల్‌కు వచ్చే వినియోగదారులంతా వ్యక్తిగత వాహనాల్లో కాకుండా ప్రజా రవాణా వ్యవస్థ (మెట్రో రైల్, ఆర్టీసీ బస్సులలో) ప్రయాణాలు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని కోరారు. కేపీహెచ్‌బీ కాలనీ, జేఎన్‌టీయూహెచ్ మెట్రో స్టేషన్లకు సమీపంలోనే లూలూ మాల్ ఉందని ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.


కేపీహెచ్‌బీ కాలనీలో ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా.. ప్రత్యామ్నాయ మార్గాలలో వాహనాలను మళ్లించేలా ఏర్పాట్లు

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, అక్టోబర్ 3 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మసీద్ గల్లీలో ఇటీవల చేపట్టి పూర్తి చేసిన వీడీసీసీరోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలానగర్ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖాజా, రంగంపేట శ్రీనివాస్ ముదిరాజ్, బాలకృష్ణ చారి, ఇర్ఫాన్, మహేందర్‌రెడ్డి స్థానికులు పాల్గొన్నారు.

## మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయం


జలమండలి అధికారులతో కలిసి యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, అక్టోబర్ 3 : ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శివశంకర్‌నగర్‌లో నూతనంగా రూ.20 లక్షల నిధులతో చేపట్టిన యూజీడీ పనులను జలమండలి డీజీఎం శంషీర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫతేనగర్ డివిజన్ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడానికి రాజీలేని కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భిక్షపతి, బాలకృష్ణ, శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, సాయినాథ్‌గౌడ్, బాగయ్య, లతీఫ్, మాలిక్, సురేందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడంలో లయన్స్‌క్లబ్ ముందంజ


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అల్లాపూర్,అక్టోబర్3: అబాగ్యులను నిరుపేదలను ఆదుకోవడంలో లయిన్స్ క్లబ్ ఎప్పుడు ముందుంటుందని 320 లయన్స్‌క్లబ్ బంజారా హిల్స్ అధ్యక్షుడు కెల్లా వెంకట్‌రావు అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ పరిధి శివాజీనగర్ గీతాంజలి స్కూల్‌లో సుమారు 650 మంది విద్యార్థులకు మాక్స్ విజన్ ఐ ఆస్పత్రి వారి సహకారంతో కంటి పరిక్షలు ఉచింతగా చేశారు. అనంతరం ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో 200 మందికి అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ సత్యానారాయణ, టి.వి.సుబ్బారావు, రోణంకి జగన్నాథం, ఎస్.ఆదినారాయణ, కృష్ణ, నాగరాజారావు, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా ఉంటా

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 3 : కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని.. కార్మికుల హక్కుల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం నాయకుడు రవిసింగ్ అన్నాడు. కేపీహెచ్‌బీ కాలనీలోని రుద్ర కార్పొరేషన్ సర్వీసెస్‌లో సురేశ్ అనే కార్మికుడు పనిచేస్తూ ఫిబ్రవరిలో పనిమానేశాడు. జీతం డబ్బులు ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. బాధితుడు కార్మిక సంఘం నాయకుడిని ఆశ్రయించగా యాజమాన్యంతో మాట్లాడి అతడికి సంబంధించిన జీతం డబ్బులను ఇప్పించాడు. ఈ సందర్భంగా కార్మికుడు కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో శ్రీనివాస్‌చారి, మనోజ్‌కుమార్, అనీల్‌కుమార్ తదితరులున్నారు.


బాధిత కార్మికుడికి జీతం డబ్బులను అందిస్తున్న రవిసింగ్